



"ఛ!! ఛ!! ఈ అప్పులవాళ్ళ గోలతో ప్రాణం పోతోంది. కంటికి కనిపిస్తే చాలు కదలనీయడంలేదు..."

తల చిరాగ్గా విదిలించుకుంటూ కళ్ళు మూసుకున్నాడు రామనాథం. కళ్ళకు రెప్పలైతే మూసుకున్నాయి గాని, మనస్సులో చెలరేగే గందరగోళానికి బ్రేకులు వేయలేక భారంగా నిట్టూర్చాడు.

కళ్ళు మూసుకున్నా, తెరిచి ఉంచినా ఆలోచనలు రెక్కల పురుగుల్లా చిరాకును కలిగిస్తూనే ఉన్నాయి.

"ఏమండోయ్! రామనాథంగారూ! రేపు మీకు 'అరియర్స్' డబ్బు లేవో ఇస్తున్నారట గదా! ఈసారి నా కిరాణా బాకీ పూర్తిగా చెల్లించాలి." సాయంత్రం ఆఫీసునుంచి బయట పడి ఇంటి కొస్తున్న రామనాథాన్ని షావుకారు నిలదీశాడు.

"ఆఁ!...ఆఁ!... అలాగే. అలాగే. మీ బాకీ తప్పకుండా తీర్చేస్తాను!" జవాబిచ్చాడు రామనాథం.

ఇంటివరకూ వచ్చి, గుమ్మంలోకి అడుగు పెట్టబోయేడో లేదో, హడావుడిపడిపోతూ పరిగెత్తుకు వచ్చింది రోజూ వాడుకగా గేదెపాలు పోసే గైరమ్మ.

"బాబుగోరూ!... రేపు మీకు అయ్యేయో డబ్బులు లెక్కట్టి యిత్తన్నారట గదా!! రెండు నెలలనుంచి నా పాల బాకీ తీర్చలేదు తమఁరు. ఈసారి తీర్చెయ్యాలండి. బాకీ ఎట్టినారంటే కుదర్దు. ఆఁ!!" వినయంగా, అందులో

# నిశ్శబ్దగానం

యం. ఉమామహేశ్వరరావు



మరికా సింత విసురునూ కలిపి అడిగింది.

"ఓ!... అలాగే గైరమ్మా... నీ పాల బాకీ తప్పకుండా తీరుస్తాను." రామనాథం నోటి వెంట ఆ మాట రాగానే సంతోషంతో వెళ్ళిపోయింది గైరమ్మ.

ఒక్క క్షణం సేపు అక్కడ ఆగి, ఇంకా ఎవరన్నా వచ్చి ఉన్నారేమోనన్న అనుమానంతో చుట్టూ చూశాడు రామనాథం. ఎవళ్ళూ లేరు...

గొర్రె తోక ఎంత కొలిచినా బెత్తెడే అన్నట్లుగా నెల రోజులూ కష్టపడ్డాక నెలాఖరున లభించే ఆ జీతపు రాళ్ళు ఈ రోజుల్లో ఏమూ లకొస్తున్నాయి? నెలలో పది రోజుల పాటు రవ్వంత ఆనందం లభించినా, మిగతా కొండంత ఆందోళననీ, ఆకాశమంత అశాంతినీ ఎదుర్కోక తప్పడం లేదు. అయినా సరే. అన్నీ మరిచిపోయేందుకోసం కాకున్నా, కాస్తంత వెసులుబాటు కలిగించేందుకైనా ఇలా అవనీ, ఇవనీ, 'అరియర్స్' అనీ ఇస్తున్నారు అధికారులు. రోజు రోజుకీ పెరిగిపోతున్న ధరలూ, పెరిగిపోతున్న అశాంతే, తృప్తిలేని జీవితం. జీవితాన్ని నిరాశతో పూరించి, నిట్టూర్పులతో కట్టిపడే రోజులివి. ఇటువంటి రోజుల్లో మనిషన్న వాడికి ఏ కాస్తంతా ఆర్థిక సహాయం లభించినా ఆనందంగాక మరే ముంటుంది?...

రామనాథం ఇలా ఆలోచనల్లో ఉండగానే చీకట్లు చుట్టూరా కమ్మేశాయి.

ఓ మధ్య తరగతి మానవుడికేవో అరియర్సు డబ్బులు అందుతున్నాయా అంటే చాలు. ఎప్పుడో నెలాఖరున 'పుచ్చుకునే కిరాణావాళ్ళు, పాలవాళ్ళు, నీళ్ళవాళ్ళు అందరూ వరిగెత్తుకొస్తారు. తామంతా అందుకోసమే బ్రతుకుతున్నట్లు, లేకపోతే బ్రతకలేమన్నట్లు!

మనిషి మనుగడకు కావల సినవి మూడు. ఒకటి డబ్బు, రెండు డబ్బు, మూడు డబ్బు. డబ్బుతో ఆనందాన్ని, సుఖాన్నీ, సంతోషాన్నీ, బలాన్నీ, తృప్తినీ పొందవచ్చు. రామనాథం మెదడు చిందరవందరగా, గజిబిజిగా అల్లుకున్న సాలెగూడులా అయిపోయింది.

ఛ... ఛ... ఏం ఆలోచన తనది! డబ్బే అన్నింటికీ మూలం కాకపోవచ్చు. ప్రేమకూ, అప్యాయతకూ, కరుణకూ డబ్బు మూలం కాదు. డబ్బుతో పొందే ప్రేమకు పునాదులుండవు. డబ్బుతో లభించే అప్యాయతకు సహజత్వం రాదు. డబ్బుతో కలిగే కరుణకు హృదయ స్పందన ఉండదు.

రామనాథం గుండెలో మరోసారి ఆవేదన రగిలింది. గొంగళీ...గొంగళీ...ఎక్కడున్నావే? అంటే, వే నన దగ్గరే ఉన్నానంటూన్నట్లు బ్రతుక్కి ఎదుగూ...బొదుగూ లేదు...

"ఏమిటిలా పరధ్యానంగా ఆలోచిస్తున్నారు?" భర్తను పట్టి కుదుపుతూ అంది అప్పుడే లోపలినుంచి ఇవతలకు వచ్చిన సావిత్రి.

జీవన సాగరంలో భర్తతో పాటుగా ధైర్యంగా ఉంటూ, భర్తకు బాసటగా,

ఆధారంగా అల్లుకుపోయిన స్త్రీమూర్తి ఆమె. అనుభవంవల్ల నెరిసిన ముంగురులు, కష్టాల్లో సైతం చెక్కుచెదరని చిరునవ్వు ఆమె సౌభాగ్యాలంకారాలు.

సావిత్రికి ఏమీ సమాధానం ఇవ్వకుండానే అక్కడి నుంచి లేచి లోపలకు నడిచేడు రామనాథం. భర్తతో పాటుగా తనూ లోపలకు కదిలిం దామె.

** ** **

"నాన్నగారూ!!"

దగ్గరకు చేరేడు రామనాథం ఇరవై ఏళ్ళ కొడుకు శంకరం. ఏదో ఆలోచిస్తున్న వాడల్లా ఆలోచనల్లోంచి తేరుకుని, ఏమిటన్నట్లుగా చూశాడు కొడుకు కేసి.

"రేపు మీకు అరియర్స్ డబ్బు లిస్తున్నారని తెలిసింది." ఆగేడు శంకరం. రామనాథానికి విషయం అర్థమైంది.

"ఆః! ఇస్తున్నారు... నీకేం కావాలో చెప్పు."

"మా క్లాసు పిల్లలమంతా ఎల్లుండే 'కేంప్' కెళ్తున్నాం నాన్నగారూ!!

ఈసారి పూర్తిగా అర్థమైంది రామనాథానికి.

"నీకూ డబ్బు అవసరం ఉందన్న విషయం తెలిసిపోయిందారా!! అయినా, నే నింకా ఎవరికీ చెప్పకముందే, అందరికీ ఈ విషయం ఎలా తెలిసిపోయిందో అర్థం గావటంలేదు. సరే...నీ కసలు ఎంతగావాలో చెప్పు!? తప్పకుండా ఇస్తాను!" అన్నాడు రామనాథం కొడుకును చూస్తూ.

"నా కో అయిదు వందలు చాలు నాన్నగారూ! సర్దుకుంటాను!" మెల్లగా పలికింది శంకరం గొంతు.

"అలాగే శంకరం...తప్పకుండా నీకు అయిదు వందలూ ఇస్తాను. సరేనా!?" అని భార్య వంక చూశాడు రామనాథం.

ఒక్కగానొక్క కొడుకు. చిన్నప్పటి నుంచీ ముద్దుగా, గారాబంగా పెంచుకున్నారాయె. పైగా క్లాసులో అన్నిటా ఫస్టు ర్యాంకుల్లో వచ్చే ఆ కొడుకంటే తల్లి కెంతో ప్రేమ. రామనాథం సరేసరి! అతనెప్పుడేది అడిగినా తల తాకట్టు పెట్టయినా తెచ్చివ్వడం అతని వంతు.

తమ మధ్య తరగతి బ్రతుకుల్లో వసంతాలు వెల్లివిరియకపోయినా బాధలూ, గాథలూ ఆ కొడుక్కు బాధాకరం కాకూడదనీ, తమ పరిస్థితులు




అతని మనస్సులో పడి, బలవంతాన ఆలోచనలకు సంకెళ్ళు బిగించుకుని తల్లితండ్రుల దగ్గర ఏమీ ఆడగలేక, సతమతం కావడం కుదరదనీ తెలుసు రామనాథానికి.

"చాలా థాంక్సు నాన్నగారూ!!"

సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ, గబగబా డ్రెస్ మార్చుకుని వంట గదిలోకి తల్లి వెనకే పరిగెత్తేడు శంకరం. అతన్నీ, అతని ఆనందాన్నీ చూసి చిన్నగా నవ్వుకున్నాడు రామనాథం.

** ** **

ఆ మరునాడు ఆఫీసు నుంచి వస్తూనే ఇవ్వవలసిన వాళ్ళందరికీ ఇచ్చేసి, తోవలోనే ఎదురైన శంకరానికి అయిదు వందలూ చేతుల్లో పెట్టి, ఖాళీ అయిన జేబుతో, బరువెక్కిన హృదయంతో ఇల్లు చేరాడు రామనాథం.

గుమ్మంలోనే ఎదురైంది సావిత్రి. ఆమె మోములో చిరునవ్వు ఎప్పటిలాగే. ఆమె కళ్ళలోంచి భర్తపై అనురాగం వెల్లువై పడుతోంది.

"సావిత్రీ " గద్గదంగా పలికింది రామనాథం స్వరం.

"అరియర్స్ రూపంలో ఏదో కొంత డబ్బు వస్తుందీ అనేసరికి మనం బకాయి ఉన్న వాళ్ళందరూ చుట్టేశారు. ఎవరి బాకీ సొమ్ము వాళ్ళు రాబట్టుకున్నారు. చివరకు కన్నకొడుకు కూడా ఆ సొమ్ములో తన వంతు భాగం తను అందుకున్నాడు. మరి!... నువ్వు ఏమీ కోరుకోలేదేం? తీర్చలేనేమోనన్న సందేహమా?"

భర్త నోటివెంబటి వస్తున్న ప్రతీ ఒక్క పదం ఆమె మనస్సును వేదనకే గురి చేసింది. భర్తవంక చెమర్చిన కనుదోయితో ఓసారి చూసింది.

"మీరు నా మెడలో మూడుముళ్ళూ వేసినప్పుడూ, 'నాతి చరామి' అంటూ నాతో ఏడడుగులు నడిచినప్పుడే మీకు అంకితం అయిపోయాను. ఇక మీ దనేది ఏదైనా మనిద్దరిదీ కదా!! మీరు మన సంసారం కోసం పడుతున్న బాధలూ, చేస్తున్న అప్పులూ అన్నీ మనం బ్రతకడం కోసం కాదనలేను. భార్యగా మీ కష్టాల్లో, సుఖాల్లో నా తోడు ఎప్పుడూ ఉంది. జీవితాంతం అది చెదిరిపోదు. మీరు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటే చాలు. మరే కానుకతోనూ నాకు పని లేదు" అంటూ భర్త వంక చూసింది సావిత్రి.

ఆమె పమిట తీసి భుజం చుట్టూ కప్పుకుంటున్నప్పుడు కంటపడిన పవిట అంచు లోపలి చిరుగులు రామనాథం గుండెని తూట్లు తూట్లు చేశాయి.

"ప్చ్!!... కనీసం...ఒక్క చీరయినా తెచ్చాను కాదు." మెల్లగా గొణుకున్నాడు రామనాథం. నీరైపోతున్న మనస్సును చిక్కబరుచుకుంటూ ఒక్క ఉదుటున లేచి ఆప్యాయంగా భార్యను కౌగలించుకున్నాడు. అతని కౌగిట్లో అలానే ఒదిగిపోయిం దా ఇల్లాలు.

"నాన్నగారూ!!...

ఆ పిలుపుతో ఒక్కమారుగా విడిపోయేరు ఇద్దరున్నూ. గుమ్మంలో నుంచుని నీళ్ళు నిండిన కళ్ళతో శంకరం కనిపించేడు. అతని చేతుల్లో పెద్ద పాకెట్.

నెమ్మదిగా నడిచొస్తూ, ఆ పాకెట్‌ను తండ్రి చేతుల్లో ఉంచాడు శంకరం.

"ఏమిట్రా ఇది??" అంటూ ఏదో సందేహంతో పాకెట్ విప్పి చూసిన రామనాథానికి నోమ్మట మాట రాలేదు.

"శంకరం!!!" అంతే అనగలిగాడు.

"అవును...నాన్నగారూ!! మీ కో జత బట్టలూ, అమ్మ కో రెండు చీరలూ అందులో ఉన్నాయి. నన్ను క్షమించండి నాన్నగారూ! రెక్కలు ముక్కలు చేసుకుని నెలంతా కష్టపడి పనిచేస్తే వచ్చే జీతం ఆ నెలలో కనీసం సగం రోజులైనా ఆదుకోవడంలేదు మనల్ని. జీవితాల్లో 'తరుగే'గాని వెలుగు లేని ఈ వర్తమాన కాలంలో, కనీసం కట్టుకోవడానికింత గుడ్డా, కడుపులు నింపుకోవడాని కింత కూడూ లభించే మంచి రోజులు ఎప్పుడొస్తాయో! మీ కంటూ, అమ్మ కంటూ ఏమీ లేకుండా, వచ్చింది వచ్చినట్లు అప్పులవాళ్ళకు పంచేసి వచ్చిన మీ మనస్సు ఎంత కుమిలిపోతుందో నే నూహించగలను. అందుకే టూర్ ప్రోగ్రాం అని చెప్పి అబద్ధం ఆడాను. నా కోసం, నా ఆనందంకోసం, మారు మాట్లాడకుండా మీరు డబ్బు ఇస్తున్నప్పుడే నాలో ఈ ఆలోచన రగిలింది నాన్నగారూ!!... అందుకే ఆ డబ్బుతో ఈ పని చేశాను. నేను చేసిన ఈ పని తప్పయితే దండించండి!!"

తల వంచుకుని కళ్ళలోంచి కన్నీటిని జారుస్తున్న కొడుకు శంకరం గుండెలోంచి వస్తున్నా యా మాటలు. పెదాలు కదులుతున్నా, స్వరం పైకి రావడంలేదు. అయస్కాంతపు తరంగాల్లా నిశ్శబ్దంగా పైకి ఉబికే ఆ మాటలను వినే శక్తి, ఆ మౌనరాగాన్ని అర్థం చేసుకునే మనస్సూ ఆ తల్లితండ్రులకే గాక ఇంకెవరి కుంటాయి మరి!!!

*